13.

# అశాంతికి మూలకారణం ఆశలే

**చిత్తశుద్ధిలేని రిత్తమానవులకు**
**ఆత్మతత్త్వమెట్లు అలవియగును?**
**ఆత్మతత్త్వమబ్బు అతి శుద్ధబుద్ధికే**
**సత్యమైన బాట సాయి మాట.**

ప్రేమస్వరూపులారా!

ఈనాడు దేశము ఎచ్చట చూచినను అశాంతితో కుమిలిపోవుచున్నది. శాంతి అన్నది ఎక్కడా కనుపించడం లేదు. కారణమేమిటి? అశాంతికి మూలకారణము మానవునియొక్క ఆశలే. తలంపులయొక్క చేరికనే మనస్సు. ఈ సంకల్పములు మొట్టమొదట మనము అరికట్టినప్పుడే మనస్సు సహజంగా స్వాధీనమవుతుంది. ఇది ఒక వస్త్రము. ఈ వస్త్రమున అనేక దారములు చేరియున్నవి. ఈ దారములు ఒకదాని కొకటి తీసివేసినపుడు వస్త్రమే లేదు. కనుకనే bundle of desires is mind. Less luggage more comfort, make travel a pleasure. ఈ వాంఛలు క్రమక్రమేణా మనము తగ్గించుకున్నప్పుడే. మనస్సుయొక్క పవిత్రత అభివృద్ధి అవుతుంది. ఈ వాంఛల చేతనే యీనాడు ప్రతి మానవుడు, ప్రతి దేశమునందు నైతిక, ధార్మిక, ఆధ్యాత్మికములనేటి యీ మూడు స్థానములను మరచిపోతున్నాడు. నైతికమనగా ఏమిటి? నిత్యజీవితములో మానవుడు సత్యమార్గము ననుసరించి, సత్యమార్గము చేత సరియైనట్టి ఆదర్శాన్ని నిరూపించాలి. దీనినే వేదము 'సత్యం బ్రూయాత్'. నీవు సత్యమునే పలుకు. పలికిన సత్యమునే ఆచరణలో యుంచు. ఆచరణయందు యుంచిన సత్యమునే వాక్కుద్వారా ప్రచారము చేయి. కనుక సత్యం బ్రూయాత్. ఇది నైతికముయొక్క ధర్మము.

ఇక ధార్మికము అంటే ఏమిటి? 'నబ్రూయాత్ సత్యమప్రియం'. ఇది ప్రియమైనది కదా అని అసత్యము చెప్పవద్దు. ఇంతియేకాక, ఈ సత్యమునకు విరుద్ధంగా అసత్యమును

srisathyasaivachanamrutam

మనము ప్రచారములో ప్రవేశపెట్టవద్దు. సత్యము చెప్పినప్పటికిని అది ప్రియమైన సత్యముగా ఉండాలి. సత్యమైనప్పటికినీ, అతనికి అప్రీతి అయినట్టి సత్యాన్ని చెప్పకూడదు. అప్రీతికరమైన సత్యంకూడా అతన్ని బాధిస్తుంది. 'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యేత్'. సత్యమనే దానిలో ఉద్రేకము కాని, అప్రీతికాని ఉండకూడదు. కనుక సత్యము కూడా ప్రియముగా ఉండాలి కాని, అప్రియమైన సత్యాన్నికూడను నువ్వు చెప్పకూడదు. ఇదియే ధర్మము.

**ఆత్మతత్వము-అనుభవైక వైద్యము**

ఇంక ఆధ్యాత్మికమనగా ఏమిటి? సత్యం బ్రూయాత్, నైతికము. నబ్రూయాత్ సత్య మప్రియం. ఇంక ధర్మమనేటిది యీ విధమైన మార్గములో నున్నప్పుడు దీనికి ఆదర్శమైనదే ఆధ్యాత్మికము. ఈ ఆధ్యాత్మికమనగా ఏమిటి? ఆత్మతత్త్వాన్ని ప్రబోధించడమే ఆధ్యాత్మికము. ఈ ఆత్మతత్త్వమనేది ఎక్కడ ఉన్నది? సర్వత్రా ఉన్నది. అయితే దీనిని గుర్తించడం చాలా కష్టము. దీనిని వెతకడం మరింత కష్టము. కనుకనే యీనాటి మానవులు ఆత్మతత్త్వమనగా అనేక విధములైనట్టి సందేహములకు గురి అవుతున్నారు. ఈ ఆత్మతత్త్వము మనమొక చిన్న ఉదాహరణముగా తీసుకోవచ్చు. ఇది కంటికి కనిపించదు. దీన్ని పట్టడానికి రూపము లేదు. మన చుట్టూ గాలి ఉన్నది. గాలియే లేకుండిన మనము బ్రతుకలేము. కాని ఆ గాలి మన కంటికి కనిపిస్తున్నదా? లేదు. ఈ కంటికే కనిపించనట్టి గాలిని నీవు ఏవిధముగా పట్టగలవు? కనుక ఈ ఆధ్యాత్మికమైనట్టి తత్త్వాన్ని అనుభూతితో మనము తెచ్చుకోవాలి.

**మానవతా విలువలు కలవాడే మానవుడు**

మానవునియందు పంచభూతముల స్వరూపమున్నది. పంచకోశముల యొక్క ఆధారమున్నది. పంచప్రాణములయొక్క తత్త్వమున్నది. ఈ పంచభూతములయొక్క తత్త్వాన్ని మనము చక్కగా విచారించాలి. మానవత్వం యొక్క శక్తులు ఐదు ఉంటున్నాయి, మానవునియందు. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస. ఈ ఐదుకూడను మానవునియందున్న మానవతా విలువలు. మానవతా విలువలు అంటే ఏమిటి? మానవుడై పుట్టి ఎంత కాలమైనప్పటికిని, మానవతా విలువలే లేకుండిన అతను మానవుడే కాదు.

srisathyasaivachanamrutam

ద్వేషము, అద్వేషము ఇట్లాంటివన్నీ కూడ మానవతా గుణములు కావు. ఇవన్నీకూడను పశుగుణములే ఇలాంటి పశుగుణములను మనం పెంచుకొని, మానవతా విలువలను తగ్గించుకొని కేవలము యీనాడు పశువుగా జీవిస్తున్నారు మానవులు.

**దుష్టసంకల్పములచేత దుఃఖితుడగు**
**సత్యసంకల్పముచేత సాధువగును**
**సకలసంకల్పశూన్యుడే శాంతినొందు**
**సత్యమును తెల్పు బాట శ్రీసాయి మాట.**

ఈనాడు శాంతి లేకుండా పోవడానికి కారణమేమిటి? సకల సంకల్ప రహితుడై సాధువగును. అతనే శాంతినొందు. శాంతికి మూలకారణమేమిటి? సంకల్పములచేతనే శాంతి లేకపోవుచున్నది. సకల సంకల్ప రహితుడే శాంతినొందు. కనుక శాంతికి ఏది మూలకారణము? మన సంకల్పములను అరికట్టుకోవాలి.

**ఐదు మానవతా విలువలకు సత్యమే శిరస్సు వంటిది**

ఇందులో మొట్టమొదటి మానవతా విలువ 'సత్యము'. సత్యమును కోల్పోయిన మనయొక్క విలువలలోపల ఒక భాగము నష్టమై పోయింది. 'ధర్మము' కోల్పోయిన మన మానవతా విలువలలోపల రెండు భాగములు వ్యర్థమైపోయింది. ఇందులో మూడవది అయిన 'శాంతి' మనము కోల్పోయిన మానవతా విలువలు మూడు. కనుక ఈ విధముగా ఒక్కటి ఒక్కటి కోల్పోవడం చేత ఒక్కొక్క అంగమును మనము కోల్పోయినట్లుగా ఉండాలి సత్యము అనేది ప్రథమ విలువ. ఈ ప్రధానమైనట్టి యీ సత్యాన్నే మనము కోల్పోతున్నాము. సత్యము చెబితే మన వ్యాపారము జరుగదు. మనకు ఉద్యోగము దొరకదు. మనము జీవితాశయములో ముందుకు పోలేము అనుకొంటున్నాము. కనుక ఏ రంగమునందు చూచినా మనకు నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, లౌకిక అన్ని రంగములయందును ఈ సత్యమును కోల్పోయిన వారు జీవించలేరు. కాని ప్రస్తుత పరిస్థితియందు సత్యము కోల్పోవడంవల్లనే తాను జీవిస్తున్నాడని భ్రమిస్తున్నాడు. ఈ విధముగా సత్యమును కోల్పోయి, మానవతా విలువను కోల్పోతున్నాడు. మొట్టమొదటిది సత్యము. అదే మానవునియొక్క శిరస్సు. ఈనాడు శిరస్సులేని మానవుడుగా జీవిస్తున్నాడు, మానవుడు.

sri sathyasai vachanamrutam

కారణమేమి? సత్యమనే దానిని కోల్పోవడం చేతనే యీ శిరస్సు కూడను కోల్పోయినాడు. 'ధర్మము' అదియే మన భుజములు. సర్వ బాధ్యత లన్నియు మోయునటువంటిది భుజములే. ధర్మాన్ని మనము కోల్పోయిన మన భుజములనే కోల్పోయిన వారమవుతాము. శాంతిని మనము కోల్పోయిన కడుపే కోల్పోయిన వారమవుతాము. కడుపే లేనప్పుడు దీనిని భుజించేది ఎట్లా? ఈ దేహమును కాపాడుకునేది ఎట్లా? కనుక దీనినే ఒక విధమైనట్టి ఆధారమైనట్టి కేంద్రముగా తీసుకున్నారు. ఈ కేంద్రాన్ని కోల్పోతున్నాము.

**ప్యూరిటీ-యూనిటీ-డివినిటీ**

ఈ మూడింటిని కోల్పోవడం చేతనే ప్రేమలేని మానవునిగా జీవిస్తున్నాడు. ప్రేమయే లేకుండిన జీవితమే లేదు. ప్రతి మానవునకు ప్రేమనే ప్రాణము. ఈ ప్రాణసమానమైనట్టి ప్రేమను కోల్పోవడం చేత మనము శవముతో సమానంగా ఉంటున్నాము. అన్ని రంగములయందు కూడను ద్వేషము, ద్వేషము, ద్వేషము. మన హృదయము ఒక సింగిల్ చైర్. నో డబుల్ సోఫా మరియు మ్యూజికల్ చైర్ కాదు. ప్రేమతో నింపబడినట్టిదీ హృదయము. కాని ఈనాడు ప్రేమ లేకపోతున్నది. ఈ ప్రేమ లేకపోవడంచేత యూనిటీ అనేది దూరమై పోతున్నాది. యూనిటీని కోల్పోవడంచేత ప్యూరిటీ కూడా కోల్పోవుచున్నాడు. ప్యూరిటీ కోల్పోవడంచేత డివినిటీని పూర్తిగా నాశనం చేసుకుంటున్నాడు. ఏమి సంపాదిస్తున్నాడీ మానవుడు? కమ్యూనిటీ, ఎనిమిటీ ఈ రెండింటిని అక్కున చేర్చుకున్నాడు. ఈ ఎనిమిటీ మితిమీరి పోతున్నాది. హృదయము నిండుగా ప్రేమ పోయి ఎనిమిటీ అనేది చాలా స్థిరంగా నిలచిపోయింది. ఈ ఎనిమిటీ అనేది రావడం చేతనే దేశమంతా కూడను ఛిన్నాభిన్నమై పోతుండాది. ప్రేమనే ఉంటే, యీ విధమైనట్టి దేశము ఛిన్నాభిన్నము అవడానికి అవకాశములేదు. కాని, లోపల ఎనిమిటి, బయట ప్రేమతో పిలచినట్లుగా హలో, హలో, హలో అని వాక్కు. ఈ 'హలో' అనేది కేవలము 'లో' కాని హలోతో మనము ప్రేమను పెంచుకోలేము. ప్రేమను పెంచుకోవాలంటే, ఇతరులను ప్రేమించాలి. ప్లస్ లవ్, ప్లస్ లవ్, ప్లస్ లవ్. దీనిని ప్లస్ చేసుకుంటూ పోతే, ప్రేమ అమితమయిన ప్రేమయిపోతుంది. ఈ ప్రేమ అధికమైనప్పుడు 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' మనుషులయొక్క బేధమే ఉండదు. అందరూ ఒక్కటై పోతారు. ఈ ఒక్కటైనప్పుడు 'ఏకాత్మ సర్వభూతాంతరాత్మ' అన్ని



sri sathyasai vachanamrutam

భూతములయందు ఒకే ఆత్మ ఉంటాది. అదే ప్రేమ స్వరూపము. కనుక యీనాడు మనం ప్రేమను కోల్పోవడం చేతనే సర్వము కోల్పోయిన వారమయిపోతున్నాము. కనుక యీనాడు మనము పెంచుకోవలసినది ప్రేమనే. ప్రేమ అనేటువంటిది వాక్కుతో చేరినప్పుడు అది 'సత్యము' అవుతుంది. ఈ ప్రేమ అనేటటువంటిది మనయొక్క ఆలోచనలో చేరినప్పుడు అదే 'శాంతి' అవుతుంది. కనుకనే ఈ ప్రేమచేతనే సత్యము, ధర్మము, శాంతి మూడింటినీ మనము సంపాదించుకోగలుగుతాము.

**మా కురు ధన జన యౌవన గర్వం...**

ప్రేమస్వరూపులారా! తాత్కాలికమైన ఈ ప్రాపంచిక జీవితముకోసం మనము పాటుబడుతున్నాము. ఇది క్షణభంగురమైనట్టిది. ఇదంతా ఒక్క క్షణములో పోతుంది. ఈ యవ్వనము ఒక్క క్షణములో పోతుండాది. 'మాకురు ధనజన యవ్వన గర్వం, హరతి నిమేషాత్ కాలః సర్వం'. ఒక్క క్షణములో పోయేటువంటిదే యవ్వనము. ఒక్క క్షణములో పోయేటటువంటిదీ ధనము. ఒక్క క్షణములో పోయేటటువంటిదీ కీర్తి. ఇవన్నీ కదలిపోయేటువంటి మేఘములే. ఏదీ శాశ్వతం కాదు. కాని ఒక్కటి మాత్రమే శాశ్వతం. అదియే సత్యం కీర్తి స్థిరం స్థిరం. మనము మంచి పేరు సంపాదించుకోవాలి. మనము ఆ మంచిపేరుతోనే మన కీర్తిని సంపాదించుకోవాలి. ఎట్లా మనకు మంచి పేరు వస్తుంది. నీవు మంచి మాట్లాడు. నీ చెవులతో మంచినే విను. నీ చేతులతో మంచి పనినే చేయి. నీ హృదయమును మంచి ఆలోచనలతోనే నింపుకో. అంతా మంచిగా మారుతుంది.

**See no evil, see what is good,**
**Talk no evil, talk what is good**
**Hear no evil, hear what is good**
**Think no evil, think what is good**
**Do no evil, do what is good**
**This is the way to GOD.**

కనుక మనము దైవత్వాన్ని పొందాలనుకున్నప్పుడు చెడు మాటలు, చెడు వినికిడి, చెడు ఆలోచనలు, చెడు కర్మలు యీ విధముగా ఉంటుంటే, నీకు మంచి ఎప్పుడు

srisathyasaivachanamrutam

చిక్కుతుంది? తెల్లవారి లేచింది మొదలుకొని రాత్రి పరుండేవరకు మనము చెడ్డను వినడము, చెడ్డను మాట్లాడటము, చెడ్డను చూడడము, చెడ్డను చేయడము, చెడ్డను చింతించడము, యీ విధముగా ఉంటుంటే, 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' ఏ ఆలోచనలో ఉన్నామో, ఆ ఆలోచనలనే పొందుతాము. కనుక ఈ చెడు ఎక్కడనుండి వస్తుంది? మన చూపులనుండి కలుగుతుండాది. మన శ్రవణమునుండి కలుగుతుండాది. మన వాక్కునుండి కలుగుతుంది. మన అలోచననుండి కలుగుతుంది. మన కర్మనుండి కలుగుతుంది. కనుకనే మానవత్వంలో ఉన్నటువంటి విలువలను సంపాదించుకొని, పోషించుకోవాలను కున్నప్పుడు ఈ ఐదు అనగా ఐదు యింద్రియములను కూడ సరియైనట్టి మార్గములో పెంపొందించుకోవాలి. కనుక మొట్టమొదట మనము ధ్యానము, జపము, యోగము యివికావు, మనకు కావలిసినటువంటివి. ఇవన్నీ కూడను కేవలము మంచి పనులు. ఇవన్నీ పవిత్రమైనట్టి కర్మలే. కాని మీ హృదయాన్ని పవిత్రము చేయాలి అనుకుంటే మొట్టమొదట యీ ఐదు యింద్రియములను నీవు పవిత్రం చేసుకోవాలి.

దీనిని పురస్కరించుకునియే దేనికోసం ఈ ఐదు యింద్రియములను మంచిగా చేసుకోవాలని, బుద్ధుడు అనేక విధములైనట్టి ప్రయత్నములు చేసాడు. 29 సం॥లవరకు అనేక గ్రంథములు చదివాడు. అనేకమంది మహానీయులను దర్శించాడు. అనేక ప్రబోధలు విన్నాడు. కాని అతనికేమాత్రము తృప్తి కలుగలేదు. దీనివలన వచ్చేదేమిటి? ఏదో పెద్దలు ఉపదేశము చేస్తున్నారు. నేను వింటున్నాను. కాని విన్నది వెళ్ళిపోతున్నాది. అనేక పెద్దలను దర్శిస్తున్నాను నేత్రముల చేత. కాని యివి చర్మచక్షువులే కాని జ్ఞానచక్షువులు కావు. మన చర్మ చక్షువులద్వారా చూచినవి చర్మ చక్షువులుగానే పోతుండాయి. కనుక యివి కావు నాకు కావలిసినవంటివి. దేనితో నేను నిర్వాణము చెందాలి? అప్పుడు అనుకున్నాడు. యోచించాడు. అప్పుడు MAN అన్నాడు. ఈ మూడింటిని అర్థం విచారించుకున్నాడు.

**MAN=M= మాయను గుర్తించు A=ఆత్మను తెలుసుకో N=అదే నిర్వాణము**

'M' అనగా మాయ. ఆ మాయను నీవు అర్థం చేసుకో. 'A' అనగా ఆత్మ తత్త్వాన్ని అర్థం చేసుకో. మాయను వశం చేసుకొని, ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకున్నప్పుడు ఇక 'N' అనేటువంటి

srisathyasaivachanamrutam

నిర్వాణము నాకు ప్రాప్తిస్తుంది అని అర్థం చేసుకున్నాడు. కనుక నిర్వాణమనేటిది ఈ రెండింటి ద్వారానే కలుగుతుంది అనే సత్యాన్ని గుర్తించాన్నాడు. ఈ నిర్వాణమునకు యింద్రియములే మూలకారణము. సమ్యక్ దృష్టి, సమ్యక్ శ్రవణము, సమ్యక్ వాక్కు, సమ్యక్ చింతన, సమ్యక్ క్రియ. కనుక యీ క్రియతో మన చేతులు పవిత్రము చేసుకోవాలి. సమ్యక్ శ్రవణముద్వారా మన చెవులు పవిత్రము చేసుకోవాలి. సమ్యక్ చింతనతో హృదయాన్ని పవిత్రం చేసుకోవాలి. సమ్యక్ వాక్కు మన పదములు సరియైనట్టివిగా ఉండాలి. కనుక ఈనాడు మానవుడు చేసిన సాధనలన్నియు కూడను, కేవలము భౌతికమైనట్టివి, లౌకికమైనట్టివి, ప్రాకృతమైనట్టివి. ఈ ఇంద్రియములను అరికట్టుకొనక, ఎన్ని సాధనలు చేసి ఏమి ప్రయోజనము? కనుక మొట్టమొదట యీ ఇంద్రియాలను అరికట్టుకునే విధానాన్ని తెలుసుకోవాలి. అప్పుడే సరియైనట్టి సాధనలను మనము పొందగలము. ఈనాటి మానవుడు యింద్రియములకు ఏమాత్రము పని పెట్టటం లేదు. కేవలము చేతులతో చేసేటటువంటి పనులు, కన్నులతో చూచేటువంటి చూపులు, మనస్సుతో తలచేటటువంటి తలంపులు, దీనితోనే మన జీవితాన్ని వ్యర్థము చేసుకుంటున్నాము. ఇవి కావు మనయొక్క జీవితము. మనము మానవులము. ఈ మానవత్వం లోని దివ్యత్వాన్ని మనము మొట్టమొదట గుర్తించుకోవాలి. ఎట్లా ఈ దివ్యత్వాన్ని గుర్తించాలి? అందరికీ తెలిసినదే. కాని తెలిసికూడను దానిని ఆచరణలో పెట్టలేక పోతున్నారు. ఏమిటి యీ ఆత్మతత్త్వము? అదే యింతవరకు చెప్పినటువంటిది. సత్యంబ్రూయాత్, సత్యమును పలుకు. అసత్యము చెడ్డది అని మనకు తెలుసును. కాని తాత్కాలికమైన చిక్కులు తప్పించుకునే నిమిత్తమై. మనము అసత్యాన్ని చెప్తున్నాము. తాత్కాలికమైన కష్టములు మాత్రము తప్పించుకుంటున్నాము. కాని శాశ్వతమైనట్టి కష్టాన్ని మనము పెంచుకుంటున్నాము. ఇది చాలా ప్రమాదకరమైనట్టిది. కనుక తాత్కాలికమైనట్టి దాని నరికట్టడానికి మొట్టమొదట ప్రయత్నించు. ఇదియే ఒక విధమైనట్టి నైతిక గౌరవము.

**సత్య హరిశ్చంద్రుని ఆదర్శం**

సత్యము పలికే సమయములో నీవు చెప్పబోవునప్పుడు కొంత చిక్కు కలుగవచ్చును. కాని క్రమక్రమేణా నీయొక్క కీర్తి అభివృద్ధి గావచ్చు. "అతను సత్యస్వరూపుడురా!" అంటారు. సత్యహరిశ్చంద్రుడు తనయొక్క మాటను నిలుపుకునే నిమిత్తమై సత్యంకోసము

సర్వ అవస్థలకు గురిఅయ్యాడు. ఏ విధంగా? తన భార్యను కూడను అమ్ముకున్నాడు. కుమారుని చంపుకున్నాడు. తనకు తానే అమ్ముకోబడ్డాడు. సత్యానికి నిలబడి కాటికాపరిగా జీవించాడు. ఏ విధంగా? సత్యమును కాపాడే నిమిత్తము యీ అవస్థలకు గురి అయ్యాడు. అదే చెప్పాడు విశ్వామిత్రుడు "ఓ చక్రవర్తీ! నీవు ఒక్కటి అసత్యమును చెప్పు. తప్పక ఒప్పుకుంటాను. నీకు యీ కష్టములే ఉండవు" అన్నాడు. నా ప్రాణమైనా యిస్తాను గాని, అసత్యాన్ని నేను చెప్పనన్నాడు. తన సతి అయినటువంటి చంద్రమతి కూడను పాదములు పట్టి ప్రార్థించింది. 'ప్రభూ! నీవిన్ని కష్టములు పడినప్పటికిని నాకే చింతలూ లేవు. కాని సత్యమును మీరు కాపాడుతూ వచ్చారు. మాట సరి. నేను మీకును, మీరు నాకు. కనుక ఏ కలవారికైనా నన్ను అమ్ముకొని నీ కీర్తి నిలబెట్టుకొనుము' అన్నది. నన్ను అమ్ముకునైనా నీయొక్క యీ కష్టాలు తీర్చుకోవాలి. అసత్యమునకు మాత్రము పాలుపడొద్దు అన్నది. అనేక విధములైనట్టి అవస్థలకు గురి అయినప్పటికిని, సత్యమును మాత్రము ప్రాణంగా తీసుకున్నాడు. గౌరవం తగ్గిపోతేనేం, దైవానుగ్రహం సంపాదించి, సత్యముచేతనే మరణించిన కుర్రవాడు బ్రతికాడు. పోయినట్టి రాజ్యముకూడ తిరిగి వచ్చింది. భార్య చెంత చేరింది. ఈశ్వర అనుగ్రహం అనే దానిచేతను దివ్యత్వాన్ని పొందాడు. పూర్వము కేవలము హరిశ్చంద్రుడు అనే పేరు మాత్రము ఉండేది. కాని యీనాడు యుగయుగములలో, జగజగములలో 'సత్యహరిశ్చంద్రుడు' అనే పేరు శాశ్వతంగా నిలచిపోయింది.

ప్రేమస్వరూపులారా! అందరికీ సత్యముయొక్క ప్రభావము తెలుసును. కాని సత్యము చెబితే తమ పని జరుగదని, కొన్ని కొన్ని చిక్కులు కలుగుతాయని, కొన్ని అవస్థలకు గురి అయిపోతామని భయపడి, యీ భయముచేతనే సత్యమును మరచిపోయి, అసత్యమును పెంచుకుంటున్నారు. ఎందుకు యీ భయము? ఈ భయముచేత కలిగేదేమిటి? భయము ఎప్పుడు వస్తుంది? తప్పు చేసినప్పుడే భయము వస్తుంది. కనుక తప్పే లేకపోతే భయమే రాదు. ఈనాడు సర్వము ఎక్కడ చూచినా భయము, భయము, భయము.

**భయంభయం బ్రతుకు భయం అన్నా**

sri sathyasai vahini amrutam

**మనకీలోకం పన్నిన పద్మవ్యూహం**
**గతిలేని మానవులకు చితికిన సంసారములకు**
**కష్టాలే బంధువులా! కన్నీళ్లే కానుకలా!**

ఈ కష్టాలే జీవితమా! కడగండ్లే జీవితమా! ఈ కఠోర నరకమనేది యిక అనుభవించలేము మనకొద్దు. వద్దు, వద్దు. కనుక మనము సత్యాన్ని సాధించాలి. ధర్మాన నడుచుకోవాలి. శాంతిని సంపాదించుకోవాలి. ఈ మూడింటిని సంపాదించుకుంటే మన జీవితము పూర్ణ జీవితముగా మారిపోతుంది. కనుక మానవుడు పూర్ణత్వము కావాలనుకుంటే సాధ్యమైనంతవరకు అసత్యమాడకుండా చూచుకోవాలి. ఒకవేళ అసత్యమనేంటిది పలుకవలసి వచ్చిందా! అప్పుడు యీ సత్యము వద్దు. అసత్యమూ వద్దు. నువ్వు నిశ్చలముగా ఉండు.

**సత్య సాధనకు భగవంతునితోడ్పాటు ఎప్పుడూ ఉంటుంది**

సత్యస్వరూపుడైనట్టి మహర్షి నిరంతరము సత్యముకోసం పాటుపడుతూ వచ్చాడు. అతను ఒక వనంలో కూర్చొని తపస్సు చేస్తూ ఉన్నాడు. ఈశ్వరుడు అతనిని పరీక్ష చేసే నిమిత్తమై ఒక జింకను తరుముకుంటూ వచ్చాడు. అతను వేటగాడు కాదు, ఈశ్వరుడు. ఈయొక్క తపస్సు చేసుకునే వానికంటి ఎదురుగా పోయేటట్టుగా ఒక జింకను తోలుకొని వచ్చాడు. చూశాడు యీ ఋషి. ఈ వేటగాడు వచ్చాడు. ఋషీ! ఒక జింకను తరుముకుంటూ వచ్చాను, మీరు చూచారా? చూడలేదు అంటే అసత్యము చూచితి అంటే అపకారము. సత్యమును కాపాడుకునే నిమిత్తము అపకారము చేయకూడదు. అపకారము కోసము సత్యమును ఋజువు చేయకూడదు. ఈ రెండూ రెండు నేత్రములవంటివి కనుక, కాపాడుకోవాలని సత్యముగా ఉండాలనుకొన్నాడు. అన్నిటికీ ఉపయోగము, ఉపకారము, ఉపమానము సందించేటువంటివాడు భగవంతుడే. కన్నులు మూసుకొని ప్రార్థించాడు. 'స్వామీ! నా సత్యము తప్పకుండా ఆ మృగమునకు అపకారము జరుగకుండా నాకేదో భావము అందించి నన్ను రక్షించు' అన్నాడు. ఒక్క నిముషంలోపల చక్కని వైబ్రేషన్ వచ్చేసింది. ఆ యీశునితో చెబుతున్నాడు. యీ ఋషి 'ఏవి చూచెనో అవి పలుకవు. ఏది

sri sathyasai vacharamrutam

పలుకునో అది చూడలేదు. ఏమందునోయీ' అన్నాడు. చూచినవి కన్నులు. కాని కన్నులకు నోరులేదు. చెప్పగలిగేటువంటిది నోరు. కాని నోరు చూడలేదు. నేనేమి చేతును? ఏది చూచిందో అది చెప్పాలి. ఏది చెబుతుందో అది చూడాలి. కాబట్టి చూచిందేదీ కన్నులు. చెప్పిందేదీ నోరు. కనుక యిది సత్యము కాదని విన్నపము చేసాడు. అప్పుడు యీశ్వరుడు ప్రత్యక్షమై, యీ సత్యమును నీవు సాధించావు. త్వరలోనే నీకు మోక్షప్రాప్తి కలుగుగాక అని ఆశీర్వదించి వెళ్ళాడు. కనుక అసత్యము ఆడవలసినట్టి పరిస్థితి వచ్చినప్పుడు అసత్యము వద్దు. సత్యము వద్దు. నీవు సమయం తీసుకో. ఏ విధమైనట్టిది లేకుండా మౌనము వహించు. అంతేకాని, అపకారము జరిగేదానికి ఒక అవకాశము చిక్కింది కదా అని, ఈ బాధలంతా తప్పించుకోవచ్చని అసత్యమాడకూడదు. ఈ విధమైనట్టి ఒక ఉపయోగము, ఉపకారము, యుక్తులు లేకపోవడంచేతనే జగత్తు అంతా చిక్కుల పాలయిపోతున్నాది.

## Truth is God, Love is God

మొట్టమొదట సత్యముయొక్క రహస్యాన్ని మనము గుర్తించాలి. ఆ సత్యముయొక్క రహస్యమేమిటి? సత్యమే దైవము. Truth is God. ఆ సత్యమే దైవమనేటి భావాన్ని మనం నమ్మాలి. Love is God, Live in Love. ఈ సత్యములో మనము జీవించాలి. అప్పుడే మనయొక్క సంకల్పము సిద్ధిస్తూ వస్తుంది. దీనిని పురస్కరించుకునియే బుద్ధుడు ఆ విధమైనట్టి నిర్వాణము పొందాడు. బుద్ధుడు చేయనటువంటి సాధనలు లేవు. బుద్ధుడు చదువనటువంటి గ్రంథములు లేవు. బుద్ధుడు చూడనటువంటి మహనీయులు లేరు. అందరినీ చూచాడు, అన్నీ విన్నాడు. కాని కట్టకడపటికి ఏమనుకున్నాడు. దైవత్వము యిటువంటివాని తెలుపనటువంటి యీ భావములు విని ప్రయోజనమేమిటి? ఈ దైవత్వాన్ని తెలుసుకోడానికి మన హృదయమే ప్రధానమైనట్టిది. ఈ పిచ్చికోతి లాంటి యీ మనస్సు అన్ని పవిత్రమైన మార్గాలకు అడ్డు తగులుతుంది. ఈ పిచ్చికోతి అయినట్టి మనస్సు దైవాన్ని కూడను దూరము చేసి పెట్టింది. మనస్సును ఆధారము చేసుకున్న మానవుడు ఏమాత్రము కూడను సిద్ధిని పొందలేడు. మనస్సును ఆధారము చేసుకున్న మానవుడు పశువులకంటెను హీనమై పతనమగును. ఇట్టివి ఆధారము చేసుకున్న ఉర్వీజనుడు కేవలం ఒక బుద్ధునిగా

srisathyasaivachanamrutam

మారిపోతాడు కాని జ్ఞానిగా కాడు. కనుక మనస్సును నీవు సాధ్యమైనంతవరకు దూరం చేయడానికి ప్రయత్నం చేయాలి. ఈనాడు మనస్సు కేంద్రముగా తీసుకొని మన జీవితమును గడుపుతూ వస్తున్నాము. మనస్సునెప్పుడూ కేంద్రముగా తీసుకోకూడదు. Mind is a mad monkey, body is like a water bubble. Don't follow the body, don't follow the mind, follow the conscience. అదియే నీయొక్క లక్ష్యము, అదియే నీయొక్క ఆత్మతత్త్వము. ఆ conscience అనే దానిని భద్రం చేసుకో.

**నాలుగు F లు**

మా పిల్లలకు అప్పుడప్పుడు నేను చెబుతుంటాను. Four 'F's. Follow the Master, Face the devil, Fight to the end, Finish the game. ఎవరు నీ మాష్టరు? ఏదో ఒక గురువు కాదు. నీ కాన్షియన్స్‌యే నీయొక్క గురువు. నీ కాన్షియన్స్‌ని నీవు ఫాలో చెయ్యి. జీవితమనే గేమ్‌ని నీవు పూర్తి చేసుకోవాలి. ఈ విధమైనట్టి యుక్తులతో, అనేక రకములైన సులువైన మార్గములు వదలిపెట్టి ఒక కష్టమైన మార్గములో ప్రవేశించి, అన్నివిధములా కష్టములే అనుభవిస్తున్నారు. ఒంట్లో కష్టము, ఇంట్లో కష్టము, వీధిలో కష్టము ఎక్కడ చూచినా కష్టమే. మానవుడు యీనాడు సంతోషము, శాంతి అన ఎట్టివో గుర్తించలేకపోతున్నాడు. సంతోషముగా ఉన్నట్లు నవ్వుతున్నారేగాని, అదంతా కృత్రిమంగా నవ్వి నటిస్తున్నారే కాని లోపలనుంచి రావటంలేదు. ఆనందముగా ఉన్నట్లు నటిస్తున్నారే కాని, ఆనందమెక్కడ? శాంతిగా జీవిస్తున్నట్లు ప్రదర్శిస్తున్నాడు కాని శాంతి లేదక్కడ. జీవితం artificial life గా మారిపోయింది. 'No Heart'. only art. ఈ జీవితము ఎంత కాలము గడుపవీలవుతుంది? కనుక art ను దూరం చేయండి. Heart ని ఫాలో చేయండి. అదే నిజమైనట్టి ఆత్మతత్త్వము.

**ప్రేమను పెంచుకోవడమే సాయుజ్యానికి మార్గం**

నీ హార్ట్ ఏ విధముగా చెబుతుందో, దానిని నీవు అనుసరించు. అదే నీ కాన్షియన్స్. నీ కాన్షియన్స్‌ని నీవు అనుసరించు. ఈ కాన్షియన్స్‌ని ఫాలో చేస్తే కాన్షియస్‌నెస్ లోకి చేరిపోతావు. మన యీ కాన్షియస్‌నెస్‌లో చేరినట్టి వారికి ఏ బాధలు ఉండవు. ఈ



srisathyasaivachanamrutam

కాన్షియన్స్ అనేది ఒక దేహములో పరిమితమై ఉంటున్నాది. కాన్షియస్‌నెస్ అనేది సర్వత్రా వ్యాపించి ఉంటున్నాది. ఆ సర్వత్రా వ్యాపించిన గాలి లోపల, యీ దేహమనే బెలూన్‌లోపల కూర్చినది యీ గాలి, ఈ బెలూన్ పగిలిపోయినప్పుడు ఆ సర్వత్రా యుండిన గాలిలో లీనమై పోతుంది. కనుక ఊది పెట్టాము. తిరిగి యీ విశాలమైన గాలిలోపల, కాన్షియస్‌నెస్‌లోపల లీనం కావడానికి అవకాశము లేదు. ఇది ఎట్టి విశాలమైనట్టి ఒక కాన్షియస్‌నెస్ లోపల లీనంకావాలి? అని విచారిస్తున్నాడు. 'నాయనా! ఇది చాలా సులభమైనట్టి మార్గము. నీవు ఏ విధముగా బెలూన్‌లో గాలిని ఊదినావో గాలి, ఆ విధముగానే చుట్టూ ఊదుతూ, ఊదుతూ రా. క్రమక్రమేణా ఈ బెలూన్ ఉబ్బుతుంది. ఉబ్బినటువంటి బెలూన్ ఒక్కసారి ఫట్ మని పగిలిపోతుంది. అప్పుడు యీ పరిమితంగా బంధింపబడిన గాలి, విశాలమైనట్టి గాలిలో ఏకమైపోతుంది. దానినే 'సాయుజ్యము' అన్నారు. సాయుజ్యమనగా ఏమిటి? విశాలమై సర్వత్రా ఉండినట్టి గాలిలోపల యీ భిన్నమైనట్టి గాలి ఐక్యము కావడమే సాయుజ్యము. ఈ సాయుజ్యమనేటిది కాని, లోక మోక్షమనేటిదిగాని, లేక లిబరేషన్ అనేటువంటిది కాని, చాల సులభమైన మార్గము, కాని విషయము తెలియక పోవడంచేతనే, అనేక అవస్థలకు గురి అయిపోతున్నారు.

ఒక్క ప్రేమ చేతనే సర్వావస్థలను దూరము చేసుకోవచ్చు. కనుక యీ ప్రేమను మనము హృదయపూర్వకంగా పెంచుకోవాలి. మన హృదయం ప్రేమతో మాత్రమే నింపుకోవాలి.

**Start the day with love,**
**Fill the day with love,**
**Spend the day with love,**
**End the day with love,**
**This is the way to GOD.**

ఈవిధమైన సంకల్పములను సాధన చేసినప్పుడు, ఈ సంకల్పముచేత లిబరేషన్ పొందుతుంది. కనుక అన్నింటికీ సులభమైన మార్గము ప్రేమ ఒక్కటే. ఈ ప్రేమనే వాక్కులో ఉపయోగపెట్టండి. మన దగ్గర చక్కెర ఉన్నాది. ఈ చక్కెర యొక్క రుచి ఎటువంటిది?

sri sathyasai vachanamrutam

తీపియే. ఈ చక్కెరను నీళ్ళలో కలుపు. పానకమైపోతుంది. కాఫీలో కలుపు. అది తియ్యగా ఉంటాది. టీలో కలుపు. అది తియ్యగా ఉంటాది. పాయసంలో కలుపు. అది తియ్యగానే ఉంటాది. కనుక యీ చక్కెరను అన్ని మార్గములలో కలిపి, అన్నింటియందును మాధుర్యాన్ని తెప్పించాలి. కాబట్టి ప్రేమ, ప్రేమ, ప్రేమ. ఈ ప్రేమనే మధురమైనట్టి స్వీటు. అదే షుగరు. ఆ షుగరును నీవు ఏ మార్గములోనైనా ప్రవేశపెట్టు. ఎందులో కలిపినప్పటికిని, అది మధురం, మధురం, మధురం. తలంపు మధురం, మధురాతిపతే రఖిలం మధురం, మధురం మధురం. కనుక అన్నీ మధురంగా ప్రేమతో మారిపోతాయి.

**నీలో ఉన్న ప్రేమను దైవం వైపు మరలించు-అదే ముక్తికి మార్గం**

కనుక యీనాడు మనము పెంచుకోవలసినట్టిది ప్రేమ. ప్రేమను పెంచుకోండి. ఈ ప్రేమను ఒక సత్యములోపల ప్రవేశపెట్టండి. ఒక ధర్మములో ప్రవేశపెట్టండి. ఈ ప్రేమ అనేటిది ఒక పునాది. సత్యమైనట్టిది ఒక గోడ. ధర్మమనేటిది పైకప్పు. దీంట్లో నివాసముంటున్నాము మనము. ఈ పునాదే లేకపోతే గోడ నిల్చదు. గోడ లేకపోతే పైకప్పు వేయడానికి వీలుకాదు. 'సత్యం నాస్తి పరోధర్మః' అన్నారు. సత్యమనేటి పునాదిపైనే యీ ధర్మమనేటిది ఏర్పడింది. కాబట్టి యీ సత్యమే లేకపోతే ధర్మమే నిలవదు. ప్రేమనే లేకపోతే సత్యము ఉండదు. అందుకే సత్యమే ప్రధానము. సత్యమే ప్రమాణము. అందువలన దీనిలో ప్రేమ అనేది ప్రధానమైనది. ఈ ప్రేమ మనయందు సహజంగానే ఉంటుంది. కాని యీ ప్రేమలు భార్యపైనా, పిల్లలపైనా, బంధువులపైనా, మిత్రులపైనా ప్రవేశపెడుతున్నాము. ఈనాడు మనము చేయవలసినదేమిటి? ప్రేమను పెంచనక్కరలేదు. దానికి ఆహారముపెట్టి ప్రేమను అభివృద్ధి కావించనక్కరలేదు. ఎటువంటి బాధలేకుండా డైవర్ట్ చేయాలంతే. నీలోనున్నట్టి ప్రేమను భగవంతునివైపు మరల్చు. నీ ఉద్యోగంపైనున్నట్టి ప్రేమను భగవంతునివైపు మరల్చు. నీ వ్యాపారముపైనున్న ప్రేమను భగవంతునివైపు మరల్చు. నీయొక్క వృత్తిపైనున్న ప్రేమను భగవంతునివైపు మరల్చు. ఇందులో నీ పని డైవర్ట్ చేయడమే. డైవర్ట్ చేస్తే చాలు. అన్ని కార్యములు సుఖముగా జరిగిపోతాయి. నేను సరే బిజినెస్ చేస్తున్నానే. ప్రేమను యింకో విధముగా మార్చేస్తే నా బిజినెస్ ఏమవుతుందో? అనే భయానికి నీవు ఏమాత్రము గురి కావద్దు. భగవంతుడు ఒక్కడినే నీవు స్మరించు

srisathyasaivecharamrutam

భగవంతుడా!

**ఏ హృదయంబునొసగితివొ ఈశ నాకు**
**మగిడి దానినే యర్పింతు మహితమూర్తి**
**పరగ వేరేమిదెత్తు నీ అర్చనకును**
**అంజలి ఘటింతు అందుకోవయ్య నీవు.**

అని అర్పితము చేయి. నాదికాదు 'హార్ట్'. ఇది నీవిచ్చినట్టిదే. నీవు యిచ్చినట్టిదే నీవే తీసుకో. నీవిచ్చినది నీకే అర్పితము. నీ అన్నిటిని భగవత్ప్రీత్యర్థముగా అర్పితము చేసినప్పుడు, సర్వం ప్రీతిమయంగానే ఉంటుంది. ఏ ప్రత్యేకించి మరో సేవ చేయనక్కరలేదు. ప్రేమ ఒక్కటుంటే అన్ని సేవలు ప్రేమగానే ఉంటాయి. కనుకనే ప్రేమ లేనటువంటిది ఫలితము కోసము చేయడము. ప్రేమతో కూడినటువంటిది సేవగా చేయటము. ప్రేమతో చేసినదంతా సేవనే. ప్రేమలేక చేసినది అది కఠినమైన చర్య అయినప్పటికిని అది ఫలితము కోసమే చేయడము. దైవమునకు నీవు సొంతవాడవు కావాలి. నీవు సొంత వాడయినప్పుడు నీకేవిధమైనట్టి బాధలు ఉండవు. ఒక ఉదాహరణము.

## భగవంతుడు నీకు పాత స్నేహితుడే అని గుర్తించు

ఒక గృహస్తుడున్నాడు. ఆ గృహస్తునికి భార్య పిల్లలు ఉన్నారు. కాని పెద్ద గార్డెన్ పెట్టుకున్నాడు. ఈ గార్డెన్ లోపల ఇద్దరు గార్డెనర్స్ని పెట్టుకున్నాడు. ఈ గార్డెనర్స్ అంతా కూడ పని చేస్తూ ఉంటారు. కాని దినమూ వచ్చిన గారు ఒకడ్డు సాయంకాలమయినప్పటికి, 'సార్! నా దినకూలి యివ్వండి' అంటూ తీసుకుంటున్నాడు. మరొకడు నెలనెలకు వచ్చి నా జీతం నాకివ్వండి అంటున్నాడు. కాని ఇంట్లో ఉన్నటువంటి భార్య నెలకాదు, సంIIములు కూడా పని చేస్తూ ఉన్నది. నాకు జీతమివ్వండి, నాకు కూలీ యివ్వండి అని అడుగుతున్నదా? లేదు. పిల్లలంతా కూడ పని చేస్తున్నారు. ఈ బిడ్డలకు కూలి తల్లి ఏమాత్రము అడగడం లేదు. భగవంతుని మీరు ప్రార్థించకండి. Right తో కూడ fight చేయండి. భగవంతుడా! నీవు సర్వదయామయుడవు. ఆపద్బాంధవుడవు, అనాథరక్షకుడవు యీ విధముగా

sri sathyasai vachanamrutam

ప్రార్థిస్తూపోతే, మనకు భగవంతుడు క్రొత్తవాడై పోతాడు. అతను క్రొత్తవాడైపోతాడు. దైవము మనకు క్రొత్తవాడు కాదు. పాతవాడే. అనేక జన్మలనుండి కూడ చూస్తున్నాము. ఒక పాతస్నేహితునిగా తీసుకోవాలి నీవు దైవాన్ని. క్రొత్త స్నేహితునిగా తీసుకోకూడదు. క్రొత్త స్నేహితుడు అయితే మనము ఏమి చేస్తాము? నిత్యజీవితములో యోచించవచ్చును. రండి, దయచేయండి, కూర్చోండి అంటూ కుర్చీలు, చాపలు వేస్తాము. వాళ్ళకు మర్యాదలంతా అందిస్తాము. కానీ, అదే పాత స్నేహితుడు. ఏయ్ రారా! కూర్చోరా! నిల్చోరా! అంటుంటాము. కాబట్టి భగవంతుని వర్ణించడమనేటిది భగవంతుని క్రొత్తవాడిగా మార్చుకుంటున్నాము మనము. He is not a new friend, old friend. Old is gold. అతనే 'GOD'. ఆ దివ్యత్వాన్ని మనము చక్కగా అర్థము చేసుకోవాలి. ఎన్నో వర్ణనలు చేస్తుంటాడు, భక్తుడు. ఇవన్నీ కేవలము అతని మనస్సును కరిగించాలని అనుకుంటున్నాడు. భగవంతుడు మనకు యీ విధముగా వర్ణనలతో కరుగడు, ప్రేమతోనే కరుగుతాడు.

**ప్రేమరహిత మరుభూములలో**
**ప్రేమాంకురములు పెంపొంద**
**ప్రేమావేశముతో ప్రేమసుధావర్షము**
**వర్షింపగ ప్రేమనదులు ప్రవహింపగ**
**మురళిగానముసేయగదే కృష్ణా గానము సేయగదే**

అంతా ప్రేమతోనే ఉన్నది. మనలోని దుర్గుణాలను ప్రేమతోనే బయటకు పంపించాలి. మనము బీజములను నాటవలసినది ప్రేమ బీజములుగా నాటాలి. అప్పుడు ప్రేమ వర్షమే కురుస్తుంది. ప్రేమపంటే పండుతుంది. అంతా ప్రేమతో వచ్చినది ప్రేమమయంగానే మారుతుంది.

**మీలో ప్రతి ఒక్కరూ ప్రేమస్వరూపుడే-కనుక దైవమే**

ప్రేమస్వరూపులారా! మీరందరూ ప్రేమస్వరూపులే. అందరియందు ఏమీలేకపోయినప్పటికినీ, ప్రేమ మాత్రమే ఉంది. ఆ ప్రేమను లేదని చెప్పేటంటివారు ఒక్కరూ లేరిక్కడ. ప్రపంచమంతా వెదికినప్పటికిని, ప్రేమలేదని ఎవరూ చెప్పలేరు. ఏ

srisathyasaivahini.in

దానిపై ప్రేమలేకపోయినా, మనకు ధనముపైన ప్రేమ ఉంటాది. అతను యీ విధముగా డైవర్ట్ చేస్తున్నాడే కాని ప్రేమ లేకపోలేదు. కనుక అందరూ ప్రేమస్వరూపులే. అందరూ దైవస్వరూపులే. కనుక దైవానివి, దైవాన్ని ఆశించవలసిన పనిలేదు. అయితే నీవు మానవుడనుకున్నంత వరకు దైవాన్ని ఆశించాలి. ఆ భావము తెలిసినప్పుడు నీవు ఇంకే దానిని ఆశించనక్కరలేదు. Everything yours. You are monument of Love. You are monument of Peace. You are monument of Truth. You are monument of GOD. కనుకనే నీవు వేరేటటువంటివాడవు కాదు. నీవు, తాను ఒక్కటే, ఒక్కటే. 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'

కనుక ప్రేమస్వరూపులారా! అందరూ ఎలాంటి పరిస్థితియందు ప్రేమను మాత్రము మీరు వదలకండి. ప్రేమను మరొక మార్గంలో పంపకండి. ప్రేమను ప్రేమచేతనే అనుభవించండి. కనుక మీరు ప్రేమతత్వాన్ని పొందుతారు. సర్వత్ర ప్రేమను మీరు అనుభవిస్తారు. మీరే ప్రేమస్వరూపులైపోతారు. కనుక మనము తెలుసుకోవలసినదేమిటంటే ప్రేమతత్వాన్ని మనము పెంచుకోవాలి. ఈ ప్రేమతోనే సత్యము, ధర్మము, శాంతి సర్వము ఏర్పడుతున్నది. కనుక సత్యమును పోషించాలంటే మనము ప్రేమచేతనే పోషించాలి. ఒక విత్తనము తెచ్చి, బిందెలో పెట్టి, నీళ్ళుపోసి పెంచాలనుకుంటే ఆ విత్తనము కుళ్ళిపోతుంది. ఈ విత్తనము మొక్క రావాలంటే భూమిలోనే నాటాలి. భూమిలో నాటి, నీరు పోయి. తప్పక ఆ మొక్క వృక్షముగా మారిపోతుంది. అదే మాదిరిగానే, ఈ ప్రేమతత్వము ఎక్కడ నాటాలి? చేతిలో పెట్టుకుంటే మొక్క రాదు. కాళ్ళపైన పెట్టుకుంటే మొక్క రాదు. హృదయభూమిలో నాటినప్పుడే అది మొక్కగా తయారవుతుంది. హృదయభూమిలోనే యిది వృక్షముగా మారి, అందులోనే యిది ఫలాన్నికూడ అందిస్తుంది. కనుక ప్రేమతత్వాన్ని అనుభవించండి. అదే జ్ఞానతత్వము, అదే సత్యతత్వము, అదే ధర్మతత్వము.

**(తేదీ 17-04-1998న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam